సాక్షి ఖమ్మం

బుధవారం । 19 । జూలై । 2023



రెడీగా.. అమ్మేస్తున్నారు!

నర్సరీల్లో సిద్ధం చేస్తున్న మిరప నారు కొనుగోలుకు రైతులు ఆసక్తి కనబరుస్తుండగా ఏటా నర్సరీల సంఖ్య పెరుగుతోంది. 8లో



మరి.. మా పరిస్థితి ఏమిటి?

జూనియర్ కళాశాలల్లో ఇన్నాళ్లు గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసిన వారిని కాదని కొత్త వారి నియామానికి నోటిఫికేషన్ జారీ చేశారు. 8లో



వాతావరణం

బుధవారం జిల్లా అంతటా వర్షం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు ఓపీఎస్ సాధన సంకల్పయాత్ర

ఖమ్మం సహకారనగర్: పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టిన పెన్షన్ సాధన సంకల్ప యాత్ర బుధవారం ఉదయం జిల్లాకు చేరుకోనుంది. ఈమేరకు ఖమ్మం, కొత్తగూడెం కలెక్టరేట్ల వద్ద ధర్నాచౌక్‌ల్లో సభలు నిర్వహస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్ సీపీఎస్‌ఈయూ) జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. అన్ని మండలాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి

రఘునాథపాలెం: గ్రామపంచాయతీల్లో అన్ని రకాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ వీ.వీ.అప్పారావు ఆదేశించారు. మండలంలోని రేగులచలక, చింతగుర్తి గ్రామపంచాయతీల్లో మంగళవారం పర్యటించిన ఆయన రికార్డుల నమోదులో జాప్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కార్యదర్శులను హెచ్చరించారు. ఆతర్వాత ఇంటిపన్నుల వసూళ్లు, కంపోస్ట్ షెడ్ల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశుద్ధ్య చర్యలపై ఆరా తీశారు. తనిఖీల్లో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కార్యదర్శులు సంగీత, బాషా తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

- కేంద్ర మంత్రికి ఎంపీ నామ లేఖ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ రైతులకు నష్టదాయకంగా పరిణ మించిన డోర్నకల్–మిర్యాలగూడ రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. ప్రత్యామ్నాయంగా మోటమర్రి–విష్ణుపురం మార్గాన్ని ఎంచుకోవాలని లేఖలో సూచించారు. ప్రతిపాదిత మార్గంలో పలు మండలాల్లో గ్రామాల రైతులు భూమి నష్టపోనున్నందున ఈ సూచనను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎప్పుడొచ్చినా మేం రెడీ!



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార యంత్రాంగం ఒక్కొక్కటిగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం మార్గనిర్దేశంలో జిల్లా అధికారులు ఎన్నికలకు సిద్ధమవుతు న్నారు. ఈ మేరకు గతంలోనే రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించగా.. ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రచురణ, ఈవీఎంలపై అవగాహన షెడ్యూల్ విడుదల చేశారు. ఈ వ్యవహారాలను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- ఎన్నికల పనులు చక్కపెడుతున్న అధికార యంత్రాంగం
- ఇప్పటికే ఓటర్ల లెక్క తేల్చిన అధికారులు
- మొత్తం 11,67,077 మంది ఓటర్లుగా నిర్ధారణ
- రేపటి నుంచి ఈవీఎంలపై అవగాహన

ఓటర్ల జాబితా సిద్ధం


వచ్చే ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధమైంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 11,67,077 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చగా, పురుషులు 5,69,211 మంది, మహిళలు 5,97,788 మంది, ఇతరులు 78 మంది ఉన్నారు. వీరు కాక.. ఎన్ఆర్ఐ ఓటర్లు 143 మంది, సర్వీస్ ఓటర్లు 680 మంది ఉన్నారని జాబితాలో వెల్లడించారు. ఇక పోలింగ్ స్టేషన్లు 1,439 ఉన్నాయి. మొత్తంగా ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 3,11,693 మంది ఓటర్లు ఉండగా.. సత్తుపల్లిలో 2,30,267 మంది, పాలేరులో 2,25,908 మంది, మధిరలో 2,12,504 మంది, వైరా నియోజకవర్గంలో 1,86,705 మంది ఉన్నారు. కాగా, ఓటర్ల జాబితాను వచ్చేనెల 21వ తేదీన విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి సెప్టెంబర్ 19 వరకు అభ్యంతరాలపై ఫిర్యాదు చేసే అవకాశముంటుంది. ఇక ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించి, సెప్టెంబర్ 28న అన్ని అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించి అక్టోబర్ 4వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు. 2005 అక్టోబర్ 1వ తేదీకి ముందు జన్మించి.. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

తొలి విడతలో పది మండలాలు

ఈవీఎం, వీవీ ప్యాట్లపై తొలి విడతలో జిల్లాలోని పది మండలాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తారు. ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, కూసుమంచి, మధిర, బోనకల్, వైరా, సింగరేణి, సత్తుపల్లి, తల్లాడ మండలాలను తొలి దశలో ఎంచుకోగా.. ఇవి పూర్తయ్యాక మిగిలిన 11 మండలాల్లో నిర్వహిస్తారు. 2019 డిసెంబర్ 16 నుంచి 2022 అక్టోబర్ 30వరకు నమోదైన కొత్త ఓటర్లకు సంబంధించి రెండు విడతల్లో 96,482 మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేయగా, మూడో విడతలో 21,516 మందికి ఇచ్చేందుకు సిద్ధం చేశారు.

ఈవీఎంలపై అవగాహన

ఈనెల 20 నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్లపై జిల్లాలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపడుతారు. ఇవి ఎండీవీ(మొబైల్ డెమాన్‌స్ట్రేషన్ వ్యాన్), ఈడీసీ(ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ సెంటర్) ద్వారా కొనసాగుతాయి. ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ సెంటర్లు అసెంబ్లీ నియోజకవర్గానికొకటి చొప్పున ఐదు, డీఈఓ కార్యాలయంలో ఒకటి ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎండీవీలు నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటు చేస్తారు. ఈ వ్యాన్లకు డిజిటల్ తెర వీడియో, ఆడియో సౌకర్యంతో ఉండనుండగా.. అన్ని పోలింగ్ స్టేషన్లను కలుపుతూ ప్రచారం చేస్తారు. మొత్తంగా 101 ఈవీఎంలతో అవగాహన కల్పించే విషయమై అన్ని పార్టీల నాయకులకు తెలియచేస్తారు.



ఇప్పటివరకు జిల్లాలో ఓటర్లు, ఇతర వివరాలు

పోలింగ్ కేంద్రాలు	1,439
పోలింగ్ లొకేషన్లు	789
ఓటర్లు	11,67,077 మంది
పురుషులు	5,69,211
మహిళలు	5,97,788
ఇతరులు	78
ఎన్ఆర్ఐ ఓటర్లు	143
సర్వీస్ ఓటర్లు	680

ఇకనైనా కారుకూతలు మానుకోండి



వీ.వీ.పాలెంలో గోదాంను ప్రారంభించిన మంత్రి అజయ్, పక్కన డీసీసీబీ చైర్మన్ కూరాకుల తదితరులు

- వ్యవసాయం అంటే తెలియని వారు మాట్లాడడం సరికాదు
- అంతరాయం లేని విద్యుత్ ఇస్తున్న ఘనత కేసీఆర్‌దే..
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం: వడ్లు, ఎడ్లు తెలియని వారు వ్యవసాయంపై మాట్లాడడం.. సాగుకు మూడు గంటల విద్యుత్ చాలనే వ్యాఖ్యలను ఇకనైనా మానుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హితవు పలికారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తప్పుడు విమర్శలు, ప్రకటనలు ఆపకపోతే గ్రామాల్లో రైతులు తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం రైతు వేదికలో మంగళవారం రైతులతో చర్చావేదికలో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు 24గంటలు విద్యుత్ ఇస్తూ, రైతుబంధు, రైతుబీమా అమలు చేయడం ద్వారా తెలంగాణ పచ్చగా మారిందని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో భూముల విలువే కాక రైతుల ఆత్మగౌరవం పెరిగిందని చెప్పారు. గడిచిన తొమ్మిదేళ్లలో రూ.39 వేల కోట్లు వెచ్చించి నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే సాధ్యమైందని తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు విద్యుత్ విషయంలో చేస్తున్న వ్యాఖ్యలను రైతులు గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు.

రైతుల సంక్షేమానికి కృషి

డీసీసీబీ ద్వారా పంటరుణాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. వీ.వీ.పాలెం సహకార సంఘం పరిధిలో రూ.29 లక్షలతో నిర్మించిన గోదాంను ప్రారంభించిన మంత్రి, రూ.27 లక్షలతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సహకార సంఘాల పనిచేయాలని తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ తాను ఈ సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.12 కోట్ల టర్నోవర్‌తో ఉండగా.. మూడేళ్లలో రూ.19 కోట్లకు చేరిందని తెలిపారు. ఇదంతా రైతులు, అధికారులు, పాలక మండలి సహకారంతో సాధ్యమైందని నాగభూషణం పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో సర్పంచ్ మాధవి, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ అఫ్జల్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబు, డీసీఓ విజయకుమారితో పాటు నాయకులు, అధికారులు యరగర్ల హన్మంతరావు, జంగాల శ్రీను, దానయ్య, కుతుంబాక నరేష్, రావెళ్ల శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, కూరాకుల వలరాజు, శంకర్, వెంకటేశ్వర్లు, మానుష, ప్రవీణ్‌కుమార్, తిరుపతిరావు, నాగమణి, నరేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తుతో అండర్‌పాస్‌లు

- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న రైతులు
- చురుగ్గా సాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు

సత్తుపల్లి: ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అండర్‌పాస్‌ల ఎత్తు తక్కువగా ఉండడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారిలో ఐదు ఎగ్జిట్లు, 11 అండర్‌పాస్‌లు ఏర్పాటుచేస్తామని జాతీయ రహదారుల శాఖ అధి కారులు తొలుత వెల్లడించారు. ఇప్పటికే మట్టి, బీటీ పనులు కొన్నిచోట్ల పూర్తి కావొచ్చాయి. కానీ సత్తుపల్లి మండలం సదాశివునిపేటలో అండర్‌పాస్‌ల నిర్మాణంపై రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. సదాశివునిపేట–తుంబూరు మధ్య మూడు అండర్‌పాస్‌లు కేవలం ఎనిమిది అడుగుల ఎత్తుతో నిర్మించడం వారి ఆందోళనకు కారణమవుతోంది. పలుమార్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా తక్కువ ఎత్తుతోనే శ్లాబ్‌లు వేసేందుకు సెంట్రింగ్ పెట్టారని, ఇవి పూర్తయితే వాహనాలు వెళ్లడం కష్టమని రైతులు చెబుతున్నారు.

150 ఎకరాలకు దారి..

సదాశివునిపేటకు చెందిన 150 ఎకరాల పంట పొలాలకు రైతులు ఈ అండర్‌పాస్‌ల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఎత్తు తక్కువగా నిర్మిస్తుండడంతో ట్రాక్టర్లతో వెళ్లాలన్నా, పంట సరుకులతో రావాలన్నా ఇబ్బంది అవుతుందని చెబుతున్నారు. ఇదే మార్గంలో ఆయిల్‌పామ్ తోటలు, కోళ్ల ఫారాలు ఉన్నాయని పంచాయతీ తీర్మానాలు చేసి ఇచ్చినా అధికారుల్లో చలనం లేదని ఆరోపించారు. ఈ విషయమై సదాశివునిపేటకు చెందిన రైతు కాలినేని రాజేశ్ తదితరులు మాట్లాడుతూ ఇదే రహదారిలో భాగంగా ఏపీలో అండర్‌పాస్‌లు 12 అడుగుల వరకు పెంచగా.. ఇక్కడ ఎనిమిది అడుగులకే పరిమితం చేయడం సరికాదని పేర్కొన్నారు. కాగా, సదాశివునిపేట–భీమవరం ఆర్‌అండ్‌బీ రహదారిపై నిర్మిస్తున్న అండర్‌పాస్‌కు ఇంకా డిజైన్ సిద్ధం కాకుండానే పనులు చేపడుతుండడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు.



సదాశివునిపేట వద్ద అండర్‌పాస్ ఎత్తు పెంచాలని ఆందోళన చేస్తున్న రైతులు

ప్రతీ ఓటరు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అధికారులు

- కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోండి
- ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తాం
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రతీ ఓటరును ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసేలా కృషి చేస్తూనే ఎన్నికలకు సంబంధించి పనులు చేపడుతున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు జిల్లాకు 3,100 బ్యాలెట్, 2,403 కంట్రోల్ యూనిట్లు, 2,359 వీవీ ప్యాట్లు వచ్చాయని తెలిపారు. అన్ని పార్టీల నేతల సమక్షాన అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఇంజనీర్లు మొదటి దశ పరిశీలన చేయడమే కాక మాక్ పోలింగ్ కూడా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం ఈవీఎంల్లో 10 శాతం వరకు శిక్షణ, అవగాహన కోసం ఉపయోగించుకోవాలనే ఎన్నికల కమిషన్ సూచనలతో 101 యూనిట్లను పక్కన పెట్టామని చెప్పారు. వీటి ద్వారా గురువారం నుంచి ఓటర్లకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఆ తర్వాత యూనిట్లను పోలింగ్ సిబ్బంది శిక్షణ కోసం ఉపయోగిస్తామని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు అవగాహన పెంచుకుని సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. నగరంలోని డీపీఆర్సీ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రెయినర్లతో నియోజకవర్గ స్థాయి ట్రెయినర్లకు శిక్షణ ఏర్పాటుచేయగా కలెక్టర్ మాట్లాడారు. పారదర్శకంగా ఎన్నికల జాబితా సిద్ధం చేయడం, మార్పులు, చేర్పులపై దృష్టి సారించాలని, చనిపోయిన ఓటర్ల విషయంలో మరణ ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాలని సూచించారు.

నివేదికలు సమర్పించండి

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వసతుల కల్పన, భద్రతా ఏర్పాట్లపై నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. డీపీఆర్సీ సమావేశ మందిరంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎస్‌డీపీఓలు, ఎస్‌హెచ్‌ఓలతో సమావేశమైన కలెక్టర్.. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి మాట్లాడారు. ఈవీఎంల భద్రతకు నియోజకవర్గాల్లో గోడౌన్లు ఎంపిక చేసి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కాగా, జిల్లాకు 262 కి.మీ. మేర అంతర్ రాష్ట్ర సరిహద్దు ఉన్నందున చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు సీపీ చెప్పారు. ఈసమావేశాల్లో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ అప్పారావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరాం, అదనపు డీసీపీ బోస్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణతో పాటు వివిధ శాఖల అధికారులు దశరథం, మల్లీశ్వరి, రాంబాబు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలి..

18 ఏళ్ల నిండిన వారంతా కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి కొత్త ఓటర్ల నమోదు ఉంటుందని, 2005 అక్టోబర్ 1వ తేదీకి ముందు పుట్టిన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. కాగా, జిల్లాలో 1,439 పోలింగ్ కేంద్రాలను 789 ప్రాంతాల్లో గుర్తించి వసతులను పరిశీలించామని తెలిపారు. ఎన్నికల సమయానికి పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగే అవకాశముందని చెప్పారు. ప్రతీ రెండు కి.మీ. పరిధిలో ఒక పోలింగ్ స్టేషన్ ఉండాలనే నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపించొచ్చునని తెలిపారు. కాగా, జెడ్పీ ఆవరణలోని ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షాన కలెక్టర్ గౌతమ్ సందర్శించి ఉద్యోగులకు భద్రతపై సూచనలు చేశారు.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న కె.సతీష్‌ను సిటీ స్పెషల్ బ్రాంచ్‌కు, స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఉదయ్‌కుమార్ సీసీఆర్‌బీకి బదిలీ చేయగా, సీసీఎస్ సీఐ నవీన్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అలాగే, వైరా సీఐ సురేష్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా, సత్తుపల్లి సీఐ కరుణాకర్‌ను అశ్వారావుపేట సీఐగా బదిలీచేశారు. ఇక వెయిటింగ్‌లో ఉన్న ఎస్.సాగర్‌ను వైరా సీఐగా నియమిస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి.



డీసీఎస్‌ఓగా పద్మజ

ఖమ్మం సహకారనగర్: జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి(డీసీఎస్‌ఓ)గా సి.పద్మజ నియమితులయ్యారు. ఆమె హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తుండగా ఖమ్మంకు బదిలీ చేశారు. ఇక ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ డీసీఎస్‌ఓగా ఉన్న రాజేందర్‌ను మహబూబాబాద్ జిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ ఆఫీసర్(ఏసీఎస్‌ఓ)గా బదిలీ చేశారు.

జోరందుకున్న వాన

- ఉపరితల ఆవర్తనంతో జిల్లా వ్యాప్తంగా వర్షం
- ఇప్పటికే వేసిన పైర్లకు ప్రయోజనం
- ఇక పెరగనున్న వరి, మిర్చి సాగు

ఖమ్మంవ్యవసాయం: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వానలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా వర్షపు జల్లులు పడుతున్నా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు మాత్రం ముసురు వాతావరణం నెలకొంది. భారీ వర్షం కాకున్నా ఆగకుండా వాన పడుతోంది. జిల్లాలో మంగళవారం రాత్రి 8గంటల వరకు సత్తుపల్లి మండలం గంగారంలో అత్యధికంగా 19.8 మి.మీల వర్షపాతం నమోదు కాగా, సత్తుపల్లి, కొణిజర్ల, కల్లూరు, వేంసూరు, తిరమలాయపాలెం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కాగా, వర్షం, ఈదురుగాలుల కారణంగా జిల్లాలోని పలుచోట్ల మంగళవారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో మూడు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక ములుగు, మహబూబాబాద్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురిస్తే జిల్లాలోని జలాశయాల్లోకి నీరు చేరే అవకాశముంది.

పంటలకు ప్రయోజనం

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే వేసిన పైర్లకు ఉపయోగమేనని చెప్పాలి. ఇప్పటికే 1.30 లక్షల ఎకరాల్లో నాటిన పత్తి, ఐదు వేల ఎకరాల్లో వేసిన పెసర, పొడి దుక్కుల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి, ఇతర పంటలకు ఈ వానతో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా 20–25 రోజుల దశలో ఉన్న పత్తి ఎదుగుదలకు దోహదపడుతుందని, ఉద్యాన, కూరగాయల పంటలకు కూడా మేలేనని తెలిపారు.

ఊపందుకోనున్న వరి మిర్చి సాగు

ప్రస్తుతం కురుస్తున్న వానలతో వరి, మిర్చి సాగు గణనీయంగా పెరిగే అవకాశముంది. ఇప్పటికే బోర్లు, బావుల ఆధారంగా సిద్ధం చేసిన నార్లను నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వివిధ పద్ధతుల్లో రైతులు 13,685 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, మరో 91,490 ఎకరాలకు అవసరమయ్యే నార్లు పోశారు. మొత్తంగా జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనాలను రూపొందించింది. కాగా, నీటి సదుపాయం పెరిగితే ఈ ఏడాది మిర్చి సాగు కూడా పెరుగుతుందని భావిస్తున్నారు. వర్షాలు, ధర లేకపోవటంతో రైతులు పత్తి సాగుకు వెనుకంజ వేయగా... మిర్చికి ధర ఉండటంతో ఇటువైపు మొగ్గు చూపుతారని చెబుతున్నారు. ఇప్పటికే లక్ష ఎకరాల్లో మిర్చి సాగు చేసేందుకు నార్లు పోసినట్లు సమాచారం.



సత్తుపల్లి రూరల్ : సత్తుపల్లి మండలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

జిల్లాకు రెడ్ అలర్ట్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఈమేరకు అధికారులు అప్రమత్తమై ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం సింగరేణి, కామేపల్లి మండలాల్లో 100 మి.మీ.కుపైగా, రఘునాథపాలెం, ఏన్కూరు, ఖమ్మం రూరల్ మండలాల్లో 60 నుండి 100 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ఈమేరకు పిడుగులతో నష్టం జరగకుండా అందరూ దామిని యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రహదారులను మూసివేయాలని సూచించారు.

మంగళవారం రాత్రి 8గంటల వరకు 10 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదైన ప్రాంతాలు

మండలం	ప్రాంతం	వర్షపాతం
సత్తుపల్లి	గంగారం	19.8
కొణిజర్ల	గుబ్బగుర్తి	19.0
కల్లూరు	కల్లూరు	18.8
వేంసూరు	వేంసూరు	18.0
తిరుమలాయపాలెం	బచ్చోడు	16.0
సింగరేణి	గేటు కారేపల్లి	15.5
తిరుమలాయపాలెం	కాకరవాయి	14.0
సత్తుపల్లి	సత్తుపల్లి	14.0
పెనుబల్లి	పెనుబల్లి	13.8
మధిర	మధిర	13.5
ముదిగొండ	ముదిగొండ	13.0
వైరా	వైరా	12.8
కూసుమంచి	కూసుమంచి	12.8
తల్లాడ	తల్లాడ	12.8
సత్తుపల్లి	సదాశివపాలెం	12.3
కొణిజర్ల	పెదగోపతి	11.8
రఘునాథపాలెం	రఘునాథపాలెం	11.5
రఘునాథపాలెం	పంగిడి	10.8
చింతకాని	చింతకాని	10.8
మధిర	సిరిపురం	10.8
ఖమ్మం అర్బన్	ఖానాపురం	10.3

క్లుప్తంగా

దేశానికి దిక్సూచి.. కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు లేదని.. ఇకనైనా తీరు మార్చుకోవాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ దేశానికి దిక్సూచి అని.. కష్టకాలంలో దేశానికి అన్నం పెట్టిన చరిత్ర కలిగిన కుటుంబంలోని వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాగా, రైతులకు బీఆర్ఎస్ చేస్తున్న అన్యాయం, నెరవేర్చని హామీలపై నిలదీస్తామని, ఇందులో భాగంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మాట్లాడగా, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మాలోత్ రాందాస్‌నాయక్, దొబ్బల సౌజన్య, రబ్బానీ, బొందయ్య, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్ జరిగే ఇంటర్వ్యూల్లో స్పందనస్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో 170 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 20వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ



చిందరవందరగా పడేసిన సామగ్రి

మధిర: మధిర బాలికోన్నత పాఠశాలలోని ఉన్న ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గది తాళాలు పగలగొట్టి లోపల ప్రవేశించిన దుండగులు బీరువాల తాళాలను సైతం పగలగొట్టి ఆట వస్తువులు, రూ.1,300 నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై హెచ్‌ఎం యరమల కోటారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సమీపంలో బాలికోన్నత పాఠశాల స్టాఫ్ రూమ్ తాళాలను సైతం పగలగొట్టారు.

జీకేఓసీలో మద్యం కలకలం

- విధుల్లో ఉండి మద్యం సేవించిన పలువురు?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీలో కొందరు ఉద్యోగులు ఆదివారం ప్లేడే రోజు డ్యూటీ సమయాన మద్యం సేవించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సింగరేణిలో వారంలో నాలుగు రోజులు మస్టర్ ఉన్న కార్మికులకు అవసరానికి అనుగుణంగా ప్లేడే (ఒక రోజు డ్యూటీ చేస్తే రెండు మస్టర్లు) ఇచ్చే సంప్రదాయం కొన్నేళ్లుగా ఉంది. అయితే, ఆదివారం మాత్రం కొందరు అత్యవసర విభాగాల వారికి యాజమాన్యమే విధులు కేటాయిస్తుంది. ఈ నేపథ్యాన ఆదివారం డ్యూటీకి వచ్చిన ఒక నాయకుడు సహా కొందరు ఉద్యోగులు మధ్యాహ్నం మద్యం సేవించినట్లు సమాచారం. ఈ విషయమై గని మేనేజర్ మురళి విచారణ చేపట్టినట్లు తెలిసింది. గతంలో ఇదే ఓసీ వద్ద ఓ అధికారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఉద్యోగులు మద్యం సేవించగా గొడవ జరగడంతో పలువురిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి గని ఆవరణలో మద్యం, విందును నిషేధించగా, 16వ తేదీన మాత్రం బేసిక్ వర్క్‌షాపులో మందు, విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజును వివరణ కోరగా ఘటనపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,700	6,700
మొక్కజొన్న	1,750	1,650
మిర్చి	19,600	13,500
ఏసీ మిర్చి	24,500	18,500
తాలు మిర్చి	12,000	9,000
పత్తి	6,900	5,300

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,623

రెడీగా అమ్మేస్తున్నారు...!

జిల్లాలో ఏటా పెరుగుతున్న మిరప నర్సరీలు

- నాణ్యమైన నారు ఎంచుకోవాలంటున్న అధికారులు
- మిర్చికి ధర బాగుండడంతో ఈ ఏడాది పెరగనున్న సాగు విస్తీర్ణం



నర్సరీల్లోని షేడ్‌నెట్ల కింద సిద్ధమవుతున్న మిరప నారు

మధిర: మార్కెట్‌లో మిర్చికి మంచి ధర ఉండడంతో ఈ ఏడాది జిల్లాలో పంట సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. పత్తికి ఆశాజనకమైన ధర లేకపోవడంతో పలువురు రైతులు ఇటు మొగ్గు చూపుతున్నారు. ఇందుకోసం పలువురు రైతులు సొంతంగా నారు సిద్ధం చేసుకుంటుండగా.. మరికొందరు నర్సరీల వైపు దృష్టి సారించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎంచుకున్న కంపెనీ నారును నర్సరీల్లో సిద్ధం చేస్తుండడంతో కొనుగోలుకు నిర్ణయించారు. ఈమేరకు డిమాండ్ ఉండడంతో జిల్లాలో నర్సరీలు ఏటా పెరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 194 నర్సరీలకు అనుమతి ఉండగా, కొన్నింటిని రెన్యువల్ చేయాల్సి ఉంది. అయితే, మిర్చి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యాన నారుకు మంచి ధర పలుకుతుందనే భావనతో మరికొందరు నర్సరీలను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. నారు మడుల్లో పెంచిన మిరపనారు కంటే నర్సరీల్లోని నెట్ షెడ్లలో పెంచిన నార్లతో మంచి దిగుబడి వస్తుందని రైతులు నమ్ముతారు.

106 నుంచి 200...

2020 సంవత్సరంలో జిల్లాలో 106 మిరప నర్సరీలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నారు. ఇవి కాస్త 2021లో 191, 2022లో 193కు చేరగా, ఇప్పుడు 194 ఉన్నాయి. ఈ సీజన్‌లో మరో పది వరకు నర్సరీలు ఏర్పాటయ్యే అవకాశముంది. వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూరు తదితర మండలాల్లో వందకు పైగా నర్సరీలు ఉండగా, మధిర, కామేపల్లి మండలాల్లో కూడా ఉన్నాయి. జిల్లాలో గత ఏడాది 66,802 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా ఈ ఏడాది మరో 20 శాతం పెరుగుతుందని అంచనా. జిల్లాలో ఎక్కువగా సాగు చేసే తేజ రకం మిర్చిని విదేశాల్లో డిమాండ్ ఉండడం, వర్షాభావ పరిస్థితులతో పత్తికి బదులు రైతులు మిర్చిని ఎంచుకుంటున్నారు.



నర్సరీ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ

నారు రేట్లు ప్రకటిస్తే మేలు

నర్సరీలో పెరుగుతున్న మిర్చి నారుకు డిమాండ్ ఉండడంతో కొందరు నర్సరీల యజమానులు కృత్రిమ కొరత సృష్టించి ధర పెంచే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులు తనిఖీలు చేపట్టాలని, నారు ధర ప్రకటించేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. అలాగే, కొందరు తెలంగాణలని నర్సరీల యజమానులు ఆంధ్రాలోనూ నారు సాధారణ పరిస్థితుల్లో పెంచుతూ నాణ్యమైనదిగా ఇక్కడే విక్రయించే అవకాశముంది. ఈ విషయంలో అధికారులు నిఘా వేయాలనే సూచనలు వస్తున్నాయి.

నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడి

అధిక దిగుబడి సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు, నారును ఎంపిక చేసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదులు పంట పూర్తయ్యేంతవరకు భద్రపర్చాలి. రైతులు సొంతంగా నారు పోసుకుంటే ఎత్తు నారుమడులు ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ బయట కొనుగోలు చేయాలనుకుంటే లైసెన్సు కలిగిన ఉన్న నర్సరీలనే ఎంచుకోవాలి. ఉంది.

– జి అనసూయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

కొన్ని చోట్ల దోపిడీ

తిరుమలాయపాలెం: మిర్చి రైతుల అవసరాన్ని కొందరు నర్సరీల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. రైతులు తీసుకొచ్చిన విత్తనాలనైనా పెంచాల్సి ఉండగా, కొందరు తాము ఎంపిక చేసిన విత్తనాలనే నాటుతామని.. కావాలంటే నారు తీసుకోండి, లేదంటే వెళ్లండని దబాయిస్తున్నట్లు సమాచారం. తిరుమలాయపాలెం మండలంలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, కాకరవాయి, పాతర్లపాడు తదితర ప్రాంతాల్లో నర్సరీలు ఉండగా, కొందరు నిర్వాహకుల రైతుల నుంచి వస్తున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకోవాలనే యత్నాల్లో ఉన్నట్లు సమాచారం. మండలంలోని మేడిదపల్లికి చెందిన ఓ రైతు కూసుమంచిలోని ఓ నర్సరీలో సుమారు రూ.50వేలు వెచ్చించి తీసుకొచ్చిన నారు కాపుకి వచ్చాక నాసిరకందని



తేలడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇక పిండిప్రోలులోని ఓ నర్సరీ నిర్వాహకుడు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈమేరకు పిండిప్రోలుకు చెందిన రైతు గుర్రం అనిల్‌కుమార్ మాట్లాడుతూ నర్సరీలో మిర్చి నారు పెంచుకునేందుకు ముందుగానే డబ్బు చెల్లించి తీరా విత్తనాలు తీసుకెళ్లాక స్థలం లేదని యజమాని తిరస్కరించినట్లు వాపోయాడు. అంతేకాక చెల్లించిన డబ్బు కూడా తిరిగి ఇవ్వడం లేదని చెప్పారు.

మరి.. మా పరిస్థితి ఏమిటి?

- ఆందోళనలో గెస్ట్ లెక్చరర్లు
- కొత్త వారిని నియమించాలని ప్రభుత్వ ఆదేశం
- జిల్లాలో 42మందిని తీసుకునేందుకు ఆమోదం

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా కీలకమైన సబ్జెక్టులు బోధించే గెస్ట్ లెక్చరర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కష్టపడి చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగం రాకున్నా నిరాశ చెందకుండా గెస్ట్ లెక్చరర్లుగా ఏళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఇప్పుడు వీరిని కొనసాగించకుండా, రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఆధ్వర్యాన మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్నాళ్లుగా పనిచేస్తున్న వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో 61మంది

జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 7వేల మంది చదువుకుంటున్నారు. ఇక వివిధ సబ్జెక్టులను 61మంది గెస్ట్ లెక్చరర్లు బోధిస్తుండగా, నెలకు రూ.28,060 వేతనం అందుతోంది. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలోనే వీరిని రెన్యూవల్ చేస్తారు. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తున్నారు. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయటంతో గెస్ట్ లెక్చరర్లలో ఆందోళన మొదలైంది. కాగా, జిల్లాలో 42మంది నియామకానికే అనుమతించడం.. ప్రస్తుతం 61మంది విధులు నిర్వర్తిస్తున్న నేపథ్యాన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది.



పీజీ మార్కులే ప్రామాణికం

2023–24వ విద్యాసంవత్సరానికి గెస్ట్ లెక్చరర్లను తీసుకునేందుకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ప్రధానంగా పీజీ కోర్సులో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయాలని సూచించారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఎంపిక కమిటీలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. ఈ ఉత్తర్వులతో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమ పరిస్థితి ఏమిటని గెస్ట్ లెక్చరర్లు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి 26న పరిశీలన అనంతరం 27వ తేదీన సబ్జెక్టుల వారిగా మెరిట్ జాబితా ప్రకటిస్తారు. అనంతరం 28వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హులను ఎంపిక చేయనుండగా, ఆగస్టు 1వ తేదీన విధుల్లో చేరాల్సి ఉంటుంది.

42మందికి అనుమతి

జిల్లాలోని వివిధ కళాశాలల్లో 42మంది గెస్ట్ లెక్చరర్ల నియామకానికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్(రెవెన్యూ), కళాశాల ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉండే కమిటీ ద్వారా ఎంపిక జరుగుతుంది. ఖాళీల వివరాల ఆధారంగా గెస్ట్ లెక్చరర్ల నియామకం చేపడుతారు.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడిగా రామనాథం



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం, పక్కన నాయకులు

ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన రాష్ట్ర, జిల్లా నాయకులు

ఖమ్మంఅర్బన్: తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఖమ్మంలోని కార్యాలయంలో జరిగిన ఈ కార్యకమంలో పార్టీ జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జక్కిలి ఐలయ్య, కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక రామనాథం తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ టీడీపీకి రాష్ట్రంలో పూర్వ వైభవం కచ్చితంగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రభుత్వ వైఫల్యాలనుప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు కనగాల సాంబశివరావు, కాపా కృష్ణమోహన్, నాగండ్ల మురళి, కట్రం స్వామి దొర, కనుకుంట్ల కుమార్, దోమందుల సామేల్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, చలసాని ఝూన్సీరాణి, పోటు సరస్వతి, చుండూరు రాజేశ్వరి, ఆరెం వరలక్ష్మి, నూక హన్మంతరావు, వడ్డెం విజయ్, శ్యామల, ఆకారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్ల పోస్టులను పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేయనుండగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. కామర్స్ సబ్జెక్ట్‌లో పీజీతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండి సెట్, నెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇద్దరు లెక్చరర్లకు అవకాశం ఉండగా, రెండేళ్ల బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతలు గల వారు నేరుగా కళాశాలలో సంప్రదించాలని, వివరాలకు 94910 63083 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పెరుగుతున్న గోదావరి

- ఎగువ ప్రాంతాల నుంచి 20 టీఎంసీల నీరు విడుదల
- నేడు నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం

భద్రాచలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతోంది. మంగళవారం ఉదయం 14.6 అడుగులుగా ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటల వరకు 20.5 అడుగులకు చేరుకుంది. భద్రాచలానికి ఎగువన ఉన్న మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 16 టీఎంసీలు, సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి 3.5 టీఎంసీల నీటిని విడుదల చేయగా, అది గోదావరిలో కలుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో చర్ల మండలంలోని తాలిపేరుకు భారీగా నీరు రావడంతో 22 గేట్లు ఎత్తి 26,558 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకే వదిలారు. దీంతో మొత్తంగా సుమారు 20 టీఎంసీల నీరు నదిలో కలిసే అవకాశం ఉంది. ఈ లెక్కన భద్రాచలం వద్ద బుధవారం తొలిసారిగా అధిక నీటిమట్టం నమోదయ్యే అవకాశం ఉందని, 25 అడుగులకు పైగా చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలంలో గోదావరి నీరు స్నానఘట్టాల వరకు చేరుకుంది. దీంతో ముందస్తుగా స్లూయిజ్‌ల వద్ద మోటార్లను సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. విస్తా కాంప్లెక్స్, కొత్త కాలనీ, రాఘవ నిలయం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లోని స్లూయిజ్‌లు లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, తాలిపేరులో బుధవారం సైతం నీటి ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.


పెసర పంట తొలగించిన రైతు

ఎదుగుదల లేదని, వైరస్ సోకిందని ఆవేదన

మధిర: పంట ఎదుగుదల లేకపోగా, వైరస్ సోకి దిగుబడి రాదనే ఆవేదనతో ఓ రైతు తన పొలంలో సాగు చేసిన పెసర పంటను తొలగించారు. ఖమ్మం జిల్లా మధిర మండలం ఖమ్మంపాడుకు చెందిన దొండపాటి సత్యనారాయణ మధిరలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో సబ్సిడీపై ఇచ్చిన పెసర విత్తనాలను రెండు ఎకరాల్లో సాగు చేశాడు. అయితే పంట చేతికి వస్తుందనుకున్న దశలో ఎదుగుదల లోపించగా, వైరస్ ఆశించిందని వాపోయాడు. కాయలు కూడా రాకపోవడంతో ఫిర్యాదు చేసినా శాస్త్రవేత్తలు రాలేదని ఆరోపించారు. ఈమేరకు రెండు ఎకరాల సాగుకు ఇప్పటికే రూ.50వేలకు పైగా ఖర్చయిందని రైతు తెలిపాడు. దీంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి మంగళవారం పంటను ట్రాక్టర్‌తో దున్ని తొలగించాడు. కాగా, రైతులకు రైతుబంధు ఇస్తే సరిపోదని, నాణ్యమైన విత్తనాలు వచ్చేలా చూడాలని సత్యనారాయణ కోరారు.



పెసర చేనును దున్నిస్తున్న రైతు సత్యనారాయణ



కళకళలాడుతున్న బేతుపల్లి పెద్దచెరువు

బేతుపల్లి చెరువుకు వరద!

జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో పలు చోట్ల చెరువుల్లోకి వరద నీరు చేరుతోంది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో సైతం భారీ వర్షాలు పడటంతో వరదనీరు సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువులోకి నీరు చేరింది. దీంతో పూర్తిస్థాయి నీటి మట్టం 17 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రం 14 అడుగులకు చేరింది. – సత్తుపల్లి రూరల్

బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న అధికారులు

- పశ్చిమ బెంగాల్ వాసులుగా గుర్తింపు

ఖమ్మంగాంధీచౌక్: వివిధ పనులు చేయించేందుకు అక్రమంగా తీసుకెళ్తున్న ఆరుగురు బాలలను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, అధికారులు మంగళవారం రక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆరుగురు బాలలను కొందరు ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. రైలు విజయవాడ నుంచి ఖమ్మం వైపునకు వస్తున్న క్రమంలో బచ్‌పన్ బచావో ఆందోళన్ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, ఎయిడ్ సంస్థ, చైల్డ్‌లైన్ 1098, ఆర్పీఎఫ్, జీఆర్పీతో కూడిన బృందం వీరిని అనుమానిత వ్యక్తుల నుంచి రక్షించింది. అనంతరం బాలలను ఖమ్మంలోని బాలల సంక్షేమ కమిటీ ముందు ప్రవేశపెట్టి బాలల పరిరక్షణ విభాగానికి సమాచారం ఇవ్వగా తాత్కాలికంగా అమ్మ హోంలో ఆశ్రయం కల్పించినట్లు బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ భారత రాణి తెలిపారు. కాగా, ఈ వ్యవహారంపై జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జీఆర్పీ ఎస్సైలు భాస్కర్‌రావు, త్రివేణి, మదన్‌తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు నరేష్, లింగయ్య, కె.శ్రీనివాస్, మాధవి, రాజేష్, రవిచంద్ర, రవీందర్, భాస్కర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పలు అనుమానాలు

పశ్చిమ బెంగాల్ నుంచి రైలు బాలలను తరలిస్తున్న వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలల విషయమై బచ్‌పన్ బచావో ఆందోళన్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్‌కు ఫోన్ రాగా, సంస్థ ప్రతినిధులు, పోలీసులు కలిసి విజయవాడ రైలు ఎక్కి బాలలను గుర్తించారు. ఇందులో 13 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు బాలలు ఉండగా, తల్లిదండ్రులు లేదా సంరక్షకులు కానరాలేదు. వీరి వెంట ఉన్న ఐదుగురు మాత్రం బాలలను హైదరాబాద్‌లో నిర్మాణ పనులకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. కాగా, చదుకోవాల్సిన పిల్లలను తల్లిదండ్రులు, సంరక్షకులు వెంట లేకుండా తీసుకెళ్తుండడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. బాలల తల్లిదండ్రులకు చెప్పే తీసుకెళ్తున్నారా, లేదా ఇళ్ల నుంచి పారిపోయిన వచ్చిన పిల్లలు వీరి మాయమాటలకు నమ్మి వెళ్తున్నారా అనేది తేలాల్సి ఉంది.

భూదందాకు పాల్పడుతున్న ఐదుగురు అరెస్ట్

- ప్లాట్ల యజమానులు, పేదల నుంచి వసూళ్లు

ఖమ్మంఅర్బన్: భూదాన్ కమిటీ సభ్యులుగా చెప్పుకుంటూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేసి ప్రైవేట్ పట్టా భూములను ఆక్రమించేలా ఉసిగొల్పిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను ఖమ్మం టౌన్ ఏసీపీ పీ.వీ.గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖమ్మం సమీపాన వెలుగుమట్ల రెవెన్యూ పరిధి ప్రైవేట్ భూములను ఈనెల 15న ఆక్రమణకు పాల్పడేలా ప్రోత్సహించిన 13 మందిపై ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈమేరకు ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. వెలుగుమట్ల ప్రాంతంలో నివాసముంటున్న కొప్పెర వెంకన్న, వాకబోయిన రాములు, బరిగెల జయమ్మ, బుడిగే రాములు, బాణాల లక్ష్మణాచారితో పాటు మరో ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి ప్రైవేట్ పట్టాదారులను బెదిరించి రూ.లక్షల్లో వసూలు చేయడమే కాక మరికొంత డబ్బు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. దీనికి యజమానులు నిరాకరించడంతో అమాయక పేదలకు పట్టాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.10 వేల నుండి రూ.లక్ష వరకు వసూలు చేసి ప్రైవేట్ భూములు ఆక్రమించేలా ప్రోత్సహించారని తెలిపారు. దీంతో భూముల దురాక్రమణకు యత్నం, పోలీసు విధులను అడ్డుకోవడం, మారణాయుధాలు కలిగి ఉండటం తదితర సెక్షన్లపై కేసులు నమోదు చేయగా, పరారీలో మరో ఎనిమిది మంది కోసం గాలిస్తున్నామని ఏసీపీ వివరించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా నిందుతులపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


బంక్‌లో రూ.30లక్షల మేర అవకతవకలు

మధిర: మండలంలోని సిరిపురం పెట్రోల్ బంక్‌లో నగదు లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని యజమాని మంగళవారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బంక్‌లో పనిచేసిన సిబ్బంది సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఆయన ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

'షెడ్యూల్ 5'పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్ 5 అమలుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం...జెడ్పీటీసీ, డైరెక్టర్లు, కో–ఆపరేటివ్ చైర్మన్లు సహా అన్ని పోస్టులను గిరిజనులకే కేటాయించాలని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం జిల్లాకు చెందిన లంబాడి హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి భూక్యా దేవనాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో 12% గిరిజన జనాభా ఉందని, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వీరి అభ్యున్నతి కోసం...గిరిజన ప్రాంతాల్లో వారినే స్థానిక సంస్థలు, ఇతర పదవుల్లో నియమించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం ...ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వర్సిటీల పాలకమండలి సభ్యుల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు సంబంధించిన క్లాస్–2 పాలక మండలి సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది పెంచుతూ మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియడంతో..పాలకమండలి సభ్యులుగా యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్, ప్రభుత్వం నామినేట్ చేసే ముగ్గురు సభ్యులు ఉంటారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూటీఎస్ డిమాండ్ చేసింది. ఆ సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఈమేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఏపీ విద్యా విధానాలపై | ఐరాస అభినందనలు

బాలికా విద్యకు ఏపీ సీఎం జగన్ ప్రోత్సాహం బాగుంది

ఐరాస లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని ప్రశంసలు

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి లక్ష్యాలైన అందరికీ విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం నవరత్నాలు, నాడు – నేడు, సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఐరాస ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ప్రశంసించారు. ఐరాస ప్రధాన కార్యాలయమైన న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక మండలి నేతృత్వంలో సుస్థిరాభివృద్ధిపై జూలై 17న జనరల్ అసెంబ్లీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు, విద్యారంగంలో పథకాలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లు, విద్యా దీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యార్థులకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్మార్ట్ బోర్డ్స్, బైజూస్ ట్యాబ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, వివిధ పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న తీరు, డిజిటల్ బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్ గురించి వివరించారు. నాడు – నేడు స్టాల్‌ని సందర్శించిన ఎకనామిక్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టోఫెల్ ట్రైనింగ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ డిక్షనరీలు, గోరుముద్ద, ఆణిముత్యాల పథకాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేద విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షకిన్ కుమార్ ఆమెకు వివరించారు. డిజిటల్ ఇండియా దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు.

ఏపీ స్టాల్‌పై పలు దేశాల ఆసక్తి

టాంజానియా ఆర్థిక శాఖ మంత్రి నటూ వాంబా ఏపీ స్టాల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని అభినందించారు. అమెరికా పర్మినెంట్ అబ్జర్వర్ మిషన్ టూ యునైటెడ్ నేషన్స్ ప్రొఫెసర్ ఒట్టో ఫీజిన్ బ్లాట్, అమెరికన్ డిప్లొమాటిక్ అకాడమి రిప్రజెంటేటివ్ టు యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ బిల్ గ్రాహమ్ తదితరులు ఏపీ విద్యా విధానాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో సునీత చిట్టూమూరి తదితరులు పాల్గొన్నారు.



నాడు-నేడు స్టాల్‌ను సందర్శించిన ఐక్యరాజ్యసమితి ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్

'మార్గదర్శి' కేసు విచారణ వాయిదా

- 56 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు అందజేసిన సంస్థ
- అన్ని పక్షాలు రెండు పేజీల నోట్ దాఖలు చేయండి
- సెప్టెంబరు 26కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 72 వాల్యూమ్‌లతో 56వేల పేజీల డిపాజిటర్ల వివరాలను సంస్థ మంగళవారం కోర్టుకు అందజేయగా దానిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసే అర్హతలేదని సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆరోపించారు. దీన్ని పార్టీ ఇన్‌పర్సన్ ఉండవల్లి అరుణ్ కుమార్, న్యాయవాది రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ విభేదించారు. ఏపీ, తెలంగాణ ఇద్దరినీ పార్టీ చేసినట్లు ఉండవల్లి కోర్టుకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం రిజాయిండరు దాఖలు చేసినట్లు వైద్యనాథన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని తదుపరి విచారణలోగా అన్ని పార్టీలు ప్లీడింగ్స్ పూర్తిచేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. ఈలోగా 2 పేజీల నోట్ సమర్పించాలని అన్ని పక్షాలను కోర్టు ఆదేశించింది.

ఏపీ పిటిషన్ మరో ధర్మాసనానికి..

మరోవైపు.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించిన కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టిల ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను తాను సభ్యుడుగా లేని ధర్మాసనం ముందు జాబితా చేయాలని జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

నిలిచిన వైద్యుల పదోన్నతులు

- పదోన్నతుల ప్రక్రియలో ఉద్రిక్తత
- ఖాళీలను చూపకపోవడంపై దాక్టర్ల అభ్యంతరం.. డీఎంఈ కార్యాలయంలో నిలిచిన కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల ఆందోళనలతో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తదుపరి కౌన్సెలింగ్ ఎప్పుడన్న అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

● రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లో పనిచేస్తున్న క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీస్ సహా డెంటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 190 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. వారికి మంగళవారం ఉదయం 10 గంటలకు డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఖాళీలన్నీ చూపకుండా కేవలం అభ్యర్థుల సంఖ్య ప్రకారమే చూపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర స్థాయిలో 900 ఖాళీలుండగా, అభ్యర్థుల సంఖ్య ప్రకారమే ఖాళీలు చూపించడం ఏంటని డాక్టర్లు ప్రశ్నించారు. కేవలం తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పడిన కొత్త కాలేజీల్లోనే ఖాళీలు చూపించారని, పాత కాలేజీల్లో ఎందుకు చూపడం లేదని నిలదీశారు. ఉస్మానియా, గాంధీ వంటి మెడికల్ కాలేజీల్లో ఉన్న అన్ని ఖాళీలు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు.దీనిపై ఉద్రిక్తత నెలకొనడంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది.

ఖాళీలను చూపిస్తే హైదరాబాద్‌కే ప్రాధాన్యం..

అన్ని కాలేజీల్లో ఖాళీలను చూపిస్తే పదోన్నతులు పొందిన వారంతా కూడా హైదరాబాద్ లేదా సమీపంలోని మెడికల్ కాలేజీలకే ప్రాధాన్యం ఇస్తారని డీఎంఈ వర్గాలు చెబుతు న్నాయి. కొత్త కాలేజీలకు అసోసియేట్ ప్రొఫెసర్ల అవసరం చాలా ఉందని, దాంతో వాటిని ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

అందరూ అలానే అడగరంటున్న వైద్యుల సంఘం

అందరూ ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలనే అడగడం లేదని, అన్ని అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలు చూపిస్తే వచ్చే నష్టమేమి లేదని తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల అంటున్నారు.

నిబంధనల మేరకే కౌన్సెలింగ్

జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం కొత్త మెడికల్ కాలేజీలలో పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఎంఈ రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలల్లో అభ్యర్థుల లభ్యత, అవసరాల ఆధారంగా ఖాళీల మ్యాట్రిక్స్ తయారు చేశామన్నారు. కొందరు అనవసరంగా గందరగోళం సృష్టించి కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని కాలేజీల్లో సేవలు చేయాలని కోరుకుంటోందన్నారు.

ఉస్మానియాలో జనరల్ సర్జరీలో 31 మంది, పీడియాట్రిక్స్‌లో 55 మంది, ఓబీజీలో 55 మంది, ఆర్థోలో 19 మంది, అనస్థీషియాలో 25 మంది, జనరల్ మెడిసిన్‌లో 27 మంది, గాంధీలో 23 మంది జనరల్ మెడిసిన్, 26 మంది జనరల్ సర్జరీ, 31 మంది అనస్థీషియా ఫ్యాకల్టీలున్నారని వివరించారు. మిగిలిన చోట్ల నింపాల్సిన అవసర ముందన్నారు. నిలిచిన కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వంతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని రమేష్ రెడ్డి వివరించారు.

11 ఎకరాలు ఎలా కేటాయించారు?

- కోకాపేటలో విలువైన భూమిని కేబినెట్ అనుమతి లేకుండానే అధికారపార్టీకి కట్టబెట్టారా?
- ప్రభుత్వానికి, బీఆర్‌ఎస్ పార్టీకి హైకోర్టు నోటీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)కు కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేబినెట్ అనుమతి లేకుండానే కేటాయించారా అని ప్రశ్నించింది. కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 16కు వాయిదా వేసింది. బీఆర్‌ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపును సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌జీవో) కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎకరం దాదాపు రూ.50 కోట్ల మార్కెట్ విలువైన స్థలాన్ని.. కేవలం రూ.3,41,25,000కే ప్రభుత్వం ముట్టజెప్పిందని.. అలా 11 ఎకరాలకు గానూ దాదాపు రూ.500 కోట్లు ప్రభుత్వానికి నష్టమని పేర్కొన్నారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇంకా కేబినెట్ నిర్ణయం తీసుకోలేదన్న ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. కోకాపేట్‌లోని 11 ఎకరాల స్థలాన్ని బీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడంపై కేబినెట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రొసీడింగ్ కాపీని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి టెండర్లు లేకుండానే బీఆర్‌ఎస్ పార్టీకి అత్యంత విలువైన ప్రాంతంలో భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భూమి కేటాయించి.. నిర్మాణం చేపట్టినా ఇప్పటివరకు పబ్లిక్ డొమైన్‌లో ఆ వివరాలను ఉంచలేదని సత్యంరెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని అందజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం .. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

జిల్లా వార్తలు

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



జీకేఓసీలో వెలవెలబోతున్న లోడింగ్ పాయింట్

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిటౌన్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో సుమారు 28 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఏరియాలోని జేవీఆర్ ఓసీలో 20 వేల టన్నులు, కిష్టారం ఓసీలో 5 వేల టన్నులు, జీకేఓసీలో 3 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని సమాచారం. అంతేకాకుండా 90 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత కూడా నిలిచిపోయింది. ఎడతెరిపి లేని వర్షాలతో ఓసీల్లోని హాల్ రోడ్లన్నీ బురదమయం కాగా, ఉత్పత్తి స్తంభించడంతో సీహెచ్‌పీల లోడింగ్ పాయింట్లు వెలవెలబోతున్నాయి.

కొత్త గనుల్లో ఉత్పత్తిపై దృష్టి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని కొత్త గనులకు అనుమతులు సాధించి త్వరలోనే ఉత్పత్తి సాధించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం కె.సాయిబాబు తెలిపారు. ఇటీవల జీఎంగా విధుల్లో చేరిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తాజాగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కొత్తగూడెం రీజియన్ పరిధి మణుగూరు ఓసీకి కాలపరిమితి మూడేళ్లు ఉండగా, ఇంకా 18 ఏళ్లు పొడిగింపు ఇచ్చారని తెలిపారు. అలాగే, శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీకి కూడా మరో 15 ఏళ్ల పొడిగింపు లభించిందని చెప్పారు. ఇక ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు అనుమతులన్నీ రాగానే ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం కొత్త గనులకు అనుమతి, పాత గనులకు పొడిగింపు వస్తే రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని జీఎం తెలిపారు.

పర్సనల్ విభాగంలో అధికారుల బదిలీలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న పర్సనల్ విభాగం అధికారులను మంగళవారం బదిలీ చేశారు. ఇద్దరు డీజీఎంలు, ఇద్దరు పర్సనల్ మేనేజర్లు, ముగ్గురు డీవైపీఎంలు, ముగ్గురు సీనియర్ పీఓలు, ఒక వెల్ఫేర్ ఆఫీసర్‌ను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా అధికారులు ఈనెల 31 లోగా నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని సూచించారు. కాగా, ఏరియాల్లో ఏడెనిమిది ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను కార్పొరేట్‌కు బదిలీ చేయాల్సి ఉన్నా.. అలా చేయలేదనే విమర్శలొస్తున్నాయి.

రైళ్ల రద్దుతో సతమతం

- ప్రతీ వారం పొడిగిస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న జిల్లా ప్రయాణికులు
- బొగ్గు రవాణాపైనే అధికారులపై దృష్టి





కొత్తగూడెం రైల్వేస్టేషన్ (ఇన్‌సెట్) స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పారిశ్రామిక, బొగ్గు గనులకు నిలయమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రైల్వే శాఖకు ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం బొగ్గు రవాణా ద్వారా వస్తోంది. దీనిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్న రైల్వే శాఖ ప్రయాణికుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. బొగ్గు రవాణాకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్న అధికారులు ప్రయాణికుల గోడు పట్టించుకోవడం లేదు. జిల్లా నుంచి వేలాది మంది నిత్యం కొత్తగూడెం స్టేషన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్, విజయవాడ, కాజీపేట, డోర్నకల్ తదితర ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. అయితే, ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు లేకపోగా.. ఉన్న వాటిని కూడా రద్దు చేస్తుండడం, మిగతావి సరైన సమయానికి నడవకపోవడం ప్రజలను ఇబ్బందికి గురి చేస్తోంది.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి..

గత మే నెల నుంచి సాంకేతిక సమస్యలకు తోడు అదనపు రైల్వే లైన్ నిర్మాణ పనులు, ఇతర కారణాలతో కొత్తగూడెం నుంచి నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. అయితే, ఈ రద్దు వారం, పది రోజులు ఉంటుందని తొలుత అధికారులు పొడిగించినా ఇప్పటి వరకు పొడిగిస్తూనే ఉన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఖర్చు తగ్గడంతో పాటు సౌకర్యంగా ఉంటుందనే భావనతో ఎక్కువ మంది రైలు ప్రయాణానికి మొగ్గు చూపుతారు. కానీ, రైళ్లు నడవకపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మిగతా అన్ని ప్రాంతాల నుంచి నడిచే రైళ్లను సాఫీగానే నడిపిస్తుండగా.. కొత్తగూడెం నుంచి మొదలయ్యే రైళ్లను మాత్రం రద్దు చేయడంతో బొగ్గుతో వచ్చే ఆదాయంపైనే అధికారులు దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ప్రస్తుతం విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు వచ్చే రైలు, భద్రాచలం రోడ్డు నుంచి విజయవాడ వెళ్లే రైలు ఈ నెల 23వ తేదీ వరకు రద్దు చేయగా, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ వరకు నడిచే రైలును 23వ తేదీ వరకు, భద్రాచలం రోడ్డు నుంచి బల్హార్షా వరకు నడిచే రైలును 24వ తేదీ వరకు రద్దు చేశారు.

ఆలస్యానికి అంతే లేదు..

భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌కు వచ్చివెళ్లే రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెంలోని సింగరేణి గనులు, ప్రధాన కార్యాలయం, భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దర్శనం, కేటీపీఎస్, నవభారత్, మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ ఉద్యోగులు ఎక్కువగా వస్తారు. గత నెల రోజులుగా సికింద్రాబాద్ – మణుగూరు మధ్య నడిచే రైలు తెల్లవారుజామున 4.30 గంటలకు కొత్తగూడెం రావాల్సి ఉన్నా, ఉదయం 7 గంటల తర్వాత వస్తోంది. దీంతో ప్రయాణికులు పనులను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే, కాకతీయ ఎక్స్‌ప్రెస్ కూడా మూడు, నాలుగు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో గంటల తరబడి అటు సికింద్రాబాద్, ఇటు కొత్తగూడెంలో పిల్లాపాపలతో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల వరంగల్ స్టేషన్‌లో కొత్తగూడెం రావాల్సిన పలువురు వేచి ఉండగా వాటర్ ట్యాంకు, షెడ్ కూలడంతో కొందరికి గాయాలయ్యాయి.

ప్రయాణికులనూ పట్టించుకోవాలి..



భద్రాచలం రోడ్డు స్టేషన్ ద్వారా రైల్వే శాఖకు ఆదాయం అధికంగానే వస్తోంది. అయితే, రైల్వే అధికారులు కేవలం బొగ్గు రవాణాపై మాత్రమే దృష్టి సారించారు తప్ప ప్రయాణికులను పట్టించుకోవడం లేదు. మే నెల నుంచి రైళ్ల రద్దు, మిగతా రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇకనైనా అన్ని రైళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

–కొదమసింహం పాండురంగాచార్యులు, కన్వీనర్, కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ

పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాల్సిందే..

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సదస్సులో మాట్లాడుతున్న పోటు రంగారావు

ములకలపల్లి: పోడు భూములను సాగు చేసుకుంటున్న అందరికీ పట్టాలు వచ్చే వరకు పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. మండల కేంద్రంలో పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుదారుల్లో కొందరికి నామమాత్రంగా పట్టాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈ విషయమై అధికార పార్టీ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. పోడు సాగుచేసుకుంటున్న పేద గిరిజనేతరులు, గొత్తికోయలకు కూడా హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోడు సాగుదారులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, నాయకులు ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, భాస్కర్, కల్లూరి కిశోర్, పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, కల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో అగ్రస్థానమే లక్ష్యం

- రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తాం
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



అప్పారావుపేట ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణారెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కొత్తగా 16 వేల ఎకరాల్లో తోటలను విస్తరిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. అశ్వారావుపేట మండలం పండువారిగూడెంలో రైతు నడింపల్లి శివరామరాజు 54 ఎకరాల్లో పామాయిల్ సాగు చేసేందుకు ముందుకు రావడంతో చైర్మన్ మొక్క నాటి మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో 2వేల ఎకరాలకు సరిపడా మొక్కలను అందించామని, తోటల విస్తరణకు ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులకు అన్నివిధాలుగా సహకరిస్తున్నామని తెలిపారు. మొక్కల కోసం రైతులు ఆందోళన చెందొద్దని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. పట్టా భూములతోపాటు ప్రభుత్వం కొత్తగా పాస్‌పుస్తకాలు ఇచ్చిన పోడు పట్టాదారులకు కూడా మొక్కల్ని అందజేస్తామని చెప్పారు. అలాగే, దమ్మపేట మండలంలో కూడా ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. లింగాలపల్లిలోని గొర్రెగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశాక, తాటిసుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ విస్తరణ పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, కల్యాణ్, నాగబాబు, ఫీల్డ్ ఆఫీసర్లు శ్రీకాంత్, చందు, రైతు సంఘం నాయకుడు చీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ విస్తరణ, అదనపు నిర్మాణంలో భాగంగా బాయిలర్ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేయనున్నట్లు ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు.

గోదావరి కరకట్ట పటిష్టతకు చర్యలు



కరకట్టపై ఇసుక బస్తాలు పేరుస్తున్న కూలీలు

చర్ల: గత ఏడాది గోదావరికి వరద రావడంతో ఇబ్బందులు ఎదురైన దృష్ట్యా జల వనరుల శాఖ అధికారులు ఈసారి ముందస్తు చర్యలు చేపట్టారు. దుమ్ముగూడెంలో బలహీనంగా ఉన్న గోదావరి కరకట్ట హెడ్‌లాక్‌ల వద్ద, మరికొన్ని ప్రాంతాల్లో మంగళవారం ఇసుక బస్తాలను పేర్చారు. గత ఏడాది కూడా లీక్ కావడంతో అప్పటికప్పుడు ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి వరదనీరు రాకుండా చర్యలు చేపట్టారు. అలాంటి పరిస్థితి రావొద్దని ఈసారి కరకట్టకు మూడు చోట్ల తూముల వద్ద 1,500 ఇసుక బస్తాలను సిద్ధం చేయగా పనులను ఇరిగేషన్ ఏఈ సుజ్ సుహాన్, మస్తాన్ వీబేగ్ పర్యవేక్షించారు.

అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించారు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి మధు

ఇల్లెందు: దరఖాస్తు చేసుకున్న 11 లక్షల మంది పోడు సాగుదారులకు పట్టాలిస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు 4 లక్షల మందికే పట్టాలివ్వటం అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించడమేనని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ఆరోపించారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన పట్టాల్లోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గుండాల మండలం లక్ష్మీపురంలో ఓ రైతు రెండు చోట్ల పది ఎకరాలకు దరఖాస్తు చేసుకుంటే ఒకే చోట పట్టా ఇచ్చి వదిలేశారని తెలిపారు. అలాగే, ఛత్తీస్‌గఢ్ వలస ఆదివాసీలకు పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. ఇకనైనా అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణ సృష్టించేందుకు యత్నిస్తున్న అధికార పార్టీ నేతలు తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం బుధవారం ఇల్లెందు మండలం మాణిక్యారంలో జిల్లా స్థాయి సభ, 22 నుంచి 30వ తేదీన వరకు గ్రామాల్లో జీపు జాతాలు, 31న ఐటీడీఏ ముట్టడి చేపడుతున్నట్లు మధు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహరావు, తోడేటి నాగేశ్వరరావు, చింత నర్సింహరావు, కోడి శ్రీరాములు, అంజన్న, జోగ కృష్ణ, మూడు మాలు, ఈసాల పాపక్క, చింత రజిత, వాంకుడోతు శ్రీను, బానోతు సంతు, మోకాళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.